సాక్షి రంగారెడ్డి

బుధవారం ♦ 22 ♦ జనవరి ♦ 2025



భూములివ్వం

ఫ్యూచర్ సిటీకి తమ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేదిలేదని రైతులు అధికారులకు తేల్చి చెప్పారు. 8లో▸



విలీనం చేయొద్దు

ఊరెళ్లను చేవెళ్ల మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని పలువురు గ్రామస్తులు కలెక్టర్, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. 8లో▸



అదుపుతప్పిన ఆటో

ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. 8లో▸

న్యూస్‌రీల్

చిలుకూరు బాలాజీ సన్నిధిలో ప్రియాంకా చోప్రా



మొయినాబాద్: చిలుకూరు బాలాజీని సినీనటి ప్రియాంకా చోప్రా దర్శించుకున్నారు. మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయానికి మంగళవారం సాయంత్రం వచ్చారు. ఆలయం చుట్టూ రెండు ప్రదక్షిణలు చేశారు. అనంతరం గర్భగుడిలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆమెకు చిలుకూరు బాలాజీ విశిష్టతను తెలియజేశారు. స్వామివారి శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు. చిలుకూరు బాలాజీని దర్శించుకున్న అనంతరం ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. చిలుకూరుకు వెళ్లడం కొత్త ప్రయాణమంటూ పోస్టులో పేర్కొన్నారు.

మొయినాబాద్ తహసీల్ కార్యాలయంలో 'కొరటాల'



భూమి పత్రాలను అందుకుంటున్న డైరెక్టర్ కొరటాల శివ

మొయినాబాద్: ప్రముఖ సినీ డైరెక్టర్ కొరటాల శివ మంగళవారం మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తాను కొనుగోలు చేసిన భూమి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఆయన రిజిస్ట్రేషన్ అయ్యేంత వరకు తహసీల్దార్ కార్యాలయంలోనే ఉన్నారు. తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌తో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ప్రశాంతమైన వాతావరణం ఉందని చెప్పారు. రెవెన్యూ అంశాలు, సమస్యలపై సినిమా తీయాలని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ సినీ డైరెక్టర్ కొరటాల శివకు సూచించారు. భూమి రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత పత్రాలు అందజేశారు.

డ్రోన్ల కలకలం



యాచారంలో సంచరిస్తున్న డ్రోన్

యాచారం: డ్రోన్ల సంచారం ప్రజలను కంటికి కునుకు లేకుండా చేసింది. సోమవారం రాత్రి 10 నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత వరకు 20కి పైగా డ్రోన్లు సంచరించాయి. యాచారం నుంచి మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, గునుగల్, మంచాల మండలం చీదేడ్, దాద్‌పల్లి రూట్లో, యాచారం నుంచి నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, కడ్తాల్ మండలం సరికొండ, పల్లెచెల్కతండా రూట్లో, యాచారం మండల కేంద్రం నుంచి నందివనపర్తి, చౌదర్‌పల్లి, చింతుల్ల, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద, కందుకూర్ మండలం మీరాఖాన్‌పేట రూట్లో చక్కర్లు కొట్టాయి. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, గుట్టలు, రాళ్లు, రప్పలున్న వ్యవసాయ భూములు, చౌదర్‌పల్లి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ గ్రామాల మధ్య అటవీ ప్రాంతంపై సంచరించాయి. 20కి పైగా డ్రోన్లు ఒకేసారి తిరగడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. రాత్రి కంటికి కునుకు లేకుండా గడిపారు. పోలీస్, రెవెన్యూ అధికారులకు కనీస సమాచారం లేక పోవడం చర్చనీయాంశంగా మారింది.

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ కోసం ఫౌండేషన్ కోర్సుకు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 15వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభిస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20 నుంచి వచ్చేనెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇంటర్మీడియెట్ డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ 12 నుంచి 14వ తేదీ వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 040–24071178 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం వ్యవసాయ పొలంలో వేసిన మార్కింగ్

పోరాడకపోతే.. 'ఫ్యూచర్' కష్టమే!

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం భూ సేకరణ

- ఎక్కడికక్కడ అడ్డుకుంటున్న రైతులు
- ఆందోళనకారులకు అధికార పార్టీ నేతల మద్దతు
- తర్జనభర్జనలో అధికార యంత్రాంగం

యాచారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి అడ్డంకిగా మారిన ఆందోళనలు అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారాయి. గట్టిగా మందలిస్తే సర్కార్ పెద్దల నుంచి ఏం మాటొస్తుందోననే భయం.. ఊరుకుంటే ఎటు దారి తీస్తుందోననే కలవరంతో కంటికి కునుకు లేకుండా పోయింది. ఇదిలా ఉండగా స్థానిక రైతులు, ప్రజల పక్షాన పోరాడకపోతే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని భావిస్తున్న అధికార పార్టీలోని కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు ఆందోళనకారులకు అండగా స్వరం వినిపిస్తున్నారు.

పెట్టుబడులపై నజర్

ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి ప్రపంచ స్థాయిలో పెట్టుబడులు వచ్చేలా సర్కార్ దృష్టి పెట్టింది. ఆ దిశగా రోడ్ల నిర్మాణానికి అడుగులు వేస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నంబర్ 13 నుంచి 330 అడుగుల ఎలివేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి సంకల్పించిన సంగతి తెలిసిందే. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో 1,004.22 ఎకరాల భూమిని సేకరించనున్నారు. దాదాపు 42 కిలోమీటర్ల మేర విస్తరించనున్న రోడ్డు నిర్మాణంతో 4,725 మంది రైతుల తమ వ్యవసాయ భూములు కోల్పోనున్నారు. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో ఫార్మాసిటీకి యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల అసైన్డ్, పట్టా భూమిని సేకరించడానికి నిర్ణయించారు. 13,500 ఎకరాలు సేకరించారు. ఇంకా 5,833 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

'స్థానిక' ఎన్నికలపై ఊహాగానాలు

మరోవైపు ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికపై పలు ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఫ్యూచర్‌సిటీకి కావాల్సిన భూసేకరణ చేపట్టి అన్ని విధాలా అభివృద్ధి చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తారని, ఫ్యూచర్‌సిటీ ప్రాంతాన్ని హెచ్‌ఎండీఏ పరిధిలోకి తెచ్చి ప్రత్యేక వ్యవస్థగా మార్చే ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశాల నుంచి రాగానే ఈ అంశం కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 5,833 ఎకరాలతో పాటు మరో 10 వేల ఎకరాల భూములను ఫ్యూచర్ సిటీ కోసం సేకరించాలని సంకల్పించింది.

కాంగ్రెస్ నేతల మద్దతు

ఫ్యూచర్‌సిటీ నిర్మాణంతో ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు, మహేశ్వరం మండలాల్లో భూముల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో ప్రభుత్వం ప్రకటించిన పరిహారంపై రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో సర్వే పనులను ఆయా గ్రామాల్లో అడ్డుకున్నారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య మార్కింగ్ వేశారు. యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో అప్పటి బీఆర్‌ఎస్ సర్కార్ రైతులకు కనీస సమాచారం ఇవ్వకుండా 2,200 ఎకరాల పట్టా భూముల రికార్డులను టీజీఐఐసీ పేరు మీద మార్చేసి, పరిహారం డబ్బులను అథారిటీలో జమ చేసింది. 2,200 ఎకరాల పట్టా భూములను మళ్లీ తమ పేర్లపై మార్చాలని రైతులు ఆందోళనలు, ధర్నాలకు దిగుతున్నారు. పట్టా రైతులకు మద్దతుగా ఆయా గ్రామాల్లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, కీలక నేతలే నాయకత్వం వహిస్తుండడం విశేషం. గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు మద్దతుగా ఉంటున్నారు. దీంతో అధికారులు ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి

కలెక్టర్‌తో ఎమ్మెల్యే వీర్లపల్లి, మొగిలిగిద్ద పెద్దల చర్చలు



కలెక్టర్ నారాయణరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, గ్రామపెద్దలు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి ఈ నెల 31 సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ కలెక్టర్ నారాయణరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిపై ప్రొఫెసర్ హరగోపాల్, గ్రామ పెద్దలతో కలిసి కలెక్టర్‌తో చర్చించారు. గ్రామంలో చరిత్ర కలిగిన ఉన్నత పాఠశాలకు నూతన భవనం, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, ఆటస్థలం, ఆర్వో ప్లాంటు, ప్లే గ్రౌండ్‌వంటి వసతులు కల్పించాలని కోరారు. ఇంగ్లిష్, ఉర్దూ మీడియం పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణం, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు బాలుర, బాలికలకోసం విడిగా వసతి గృహాల నిర్మాణం, అంగన్‌వాడీ భవనం, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనం, పంచాయతీ కార్యాలయ భవనం, మినీస్టేడియం, గిద్దకట్ట చెరువువద్ద మినీ ట్యాంక్‌బండ్, అంతర్గ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించాలని సూచించారు. గ్రామంలో అభివృద్ధి పనులకు దాదాపు రూ.80కోట్ల నిధులతో ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గ్రామ పెద్దలు శ్యాంసుందర్, మల్లేష్, సత్యనారాయణ రెడ్డి, శ్రీశైలం, కార్తీక్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్



గ్రామ సభలో మాట్లాడుతున్న సురేష్‌మోహన్

చేవెళ్ల: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ తెలిపారు. మండలకేంద్రంలోని గ్రామ పంచాతీయ వద్ద మంగళవారం ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ హిమబిందు అధ్యక్షతన జరిగిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించి అధికారులవద్ద ఉన్న సమాచారంతో తాత్కాలిక జాబితాలు సిద్ధం చేసినట్టు చెప్పారు. ఈ జాబితాలను ఇప్పటికే పంచాయతీల వద్ద ప్రదర్శించడం జరిగిందని, గ్రామ సభల్లో ఆ పేర్లను చదివి వినిపించినట్లు చెప్పారు. జాబితాలో ఉన్న పేర్లలో ఏమైనా అభ్యంతరాలున్నా, జాబితాలో పేర్లు రాని అర్హులైన వారు గ్రామంలో ఉన్నా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, నియోజకవర్గం నాయకులు ఎస్.వసంతం, మాజీ ఉప సర్పంచ్ గంగి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

దశలవారీగా పథకాల అమలు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: అర్హులందరికీ దశలవారీగా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి అధ్యక్షతన ప్రజాపాలన వార్డు సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేది రేవంత్‌రెడ్డి సర్కార్ అని చెప్పారు. అర్హులకు పథకాలు అందకపోతే అధికారులదే బాధ్యత అని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎంత మందికి రుణమాఫీ అమలైందని ఏడీఏ సూజాతను అడగ్గా సరైన సమాచారం చెప్పలేదు. దీంతో వివరాలు లేకుండా సభకు ఎందుకు వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పష్టమైన అవగాహనతో సమావేశాలకు రావాలన్నారు. కార్యక్రమం జరుగుతుండగానే కొంత మంది గ్రామస్తులు ఆదిబట్లలో 40 ఫీట్ల రోడ్డు వేయొద్దని, దీంతో తమ ఇళ్లు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెళ్లిపోయిన తర్వాత చైర్మన్ నిరంజన్‌రెడ్డిని నిలదీశారు. పట్టణం అభివృద్ధి చెందాలంటే తప్పకుండా రోడ్లు వేయాల్సి ఉంటుందని ఆయన నచ్చజెప్పారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ కౌన్సిలర్ లావణ్య, కమిషనర్ బాలకృష్ణ, కోఆప్షన్ సభ్యులు గోపాల్‌గౌడ్, ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ చరిత్ర కాంగ్రెస్ పార్టీదే



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- అంబేడ్కర్‌ను అవమానించింది వారే
- ఆయన సిద్ధాంతాలు పాటిస్తోంది బీజేపీ మాత్రమే
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగారంలో కుండె వెంకటేశ్ ఫామ్ హౌస్‌లో మంగళవారం సాయంత్రం బీజేపీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాజ్యాంగం చేతబట్టి బీఆర్ అంబేడ్కర్ వారసులమని చెప్పుకొనే పార్టీలను ప్రజలు విశ్వసించరని అన్నారు. సొంత ఇంటి వారికే భారతరత్న బిరుదులు ఇచ్చుకున్న చరిత్ర కాంగ్రెస్‌ది అని విమర్శించారు. వాజ్‌పేయ్ ప్రధాని అయ్యేంతవరకు పార్లమెంట్‌లో అంబేడ్కర్ చిత్రపటం కూడా పెట్ట లేదని గుర్తు చేశారు. అంబేడ్కర్ ఆలోచనలు, సిద్ధాంతాలను పాటిస్తుంది బీజేపీ మాత్రమే అని తెలిపారు. గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్ గౌడ్, ప్రేమ్ రాజ్, బస్వ పాపయ్య గౌడ్, బోసుపల్లి ప్రతాప్, దేశ్యా నాయక్, కుండె వెంకటేశ్, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాధవాచారి, మండల అధ్యక్షుడు యాదిష్ తదితరులు పాల్గొన్నారు.

బురిడీల్లో దిట్ట బురానుద్దీన్

- ప్రముఖులతో దిగిన ఫొటోలు చూపిస్తూ మోసాలు
- దొరక్కుండా ముప్పతిప్పలు
- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్
- వివరాలు వెల్లడించిన రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్



బురానుద్దీన్

మొయినాబాద్: రాజకీయ ప్రముఖులతో దిగిన ఫొటోలు చూపిస్తూ.. పెద్ద పెద్ద వారితో పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ.. సీబీఐ, ఈడీ, ఏసీబీ వంటి సెంట్రల్ ఏజెన్సీస్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను చేయించి పెడతానని.. కాంట్రాక్టులు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ను మొయినాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మొయినాబాద్ మండలం తోలుకట్ట రెవెన్యూలోని సర్వే నంబర్ 144లో 6 ఎకరాల భూమి విషయంలో షాహెదాబేగం, రషీద్ మధ్య వివాదం కొనసాగుతోంది. రషీద్ తరఫున బంజారాహిల్స్‌కు చెందిన సయ్యద్ బురానుద్దీన్ అలియాస్ బురాన్ 2023 మే 9న తన అనుచరులతో తోలుకట్టలోని భూమి వద్దకు వచ్చి చాకులు, తల్వార్లతో హల్‌చల్ చేశారు. అడ్డువచ్చినవారిపై దాడి చేసి గాయపర్చారు. అప్పట్లో బురానుద్దీన్‌తో పాటు అతని అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదైంది. తనను అరెస్టు చేయకుండా బురానుద్దీన్ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నాడు. పోలీసులు ఇటీవల స్టే వెకేట్ చేయించారు.

మూడు నెలలుగా గాలింపు

బురానుద్దీన్‌తోపాటు హత్యాయత్నం కేసులో నిందితులైన మరో ఎనిమిది మందిని పట్టుకోవడానికి ఎస్‌ఓటీ, మొయినాబాద్ పోలీసులు మూడు నెలలుగా గాలించారు. బంజారాహిల్స్‌లోని ఇంటితో పాటు హైదర్షాకోట్‌లో ఒక ఫ్లాట్, శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లిలో ఓ ఫాంహౌస్ ఉన్నాయి. మూడు నెలలుగా పోలీసులు అన్ని చోట్లా వెతుకుతున్నా తప్పించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి హైదర్షాకోట్ ఫ్లాట్‌లో ఉండగా పట్టుకున్నారు. బెంజ్‌కారును స్వాధీనం చేసుకున్నారు.

12 కేసుల్లో నిందితుడు

బురానుద్దీన్ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడ్డాడు. బురానుద్దీన్ అలియాస్ బురాన్, ఓపీ సింగ్ అలియాస్ ఓపిల్ శర్మ పేర్లతో చాలా మంది రాజకీయ ప్రముఖులతో ఫొటోలు దిగాడు. వారంతా తనకు చాలా దగ్గర అని సీబీఐ, ఈడీ, ఏసీబీ వంటి సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ సంస్థల్లో పెండింగ్‌లో ఉన్న పెద్ద పెద్ద కేసులను చేయిస్తానని.. కాంట్రాక్టులు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడ్డాడు. ఇతనిపై జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్లలో 4 కేసులు, సైబరాబాద్ పరిధిలోని మొయినాబాద్, మైలార్‌దేవ్‌పల్లి, నార్సింగి, శంషాబాద్, రాజేంద్రనగర్, పోలీస్‌స్టేషన్లలో మొత్తం 12 కేసులు నమోదయ్యాయి.

రాహుల్ గాంధీ పీఏనంటూ..

ఒకసారి ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ పీఏనంటూ ఢిల్లీ నుంచి ఫోన్ చేయించుకుని జార్ఖండ్‌కు వెళ్లాడు. అక్కడ స్టేట్ ఆఫీస్‌లో ఉండి సీఎంఓతో మైనింగ్ కాంట్రాక్టు ఇప్పిస్తానని చెప్పాడు. వాళ్లు విచారణ చేయడంతో రాహుల్ గాంధీ పీఏ కాదని తేలింది. దీంతో జార్ఖండ్ పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. ఓ ఐఏఎస్ అధికారిపై సీబీఐ విచారణ జరుగుతున్న క్రమంలో బురానుద్దీన్ తాను పీఎంఓ (ప్రైమినిస్టర్ ఆఫీస్)లో పనిచేస్తానని చెప్పి.. ఆ కేసులో నుంచి బయటపడేస్తానని నమ్మించి రూ.1.50 కోట్లు తీసుకున్నాడు. ఈ క్రమంలో సీబీఐ గుర్తించి అతన్ని కూడా అరెస్టు చేసింది. హైదరాబాద్‌లో ఓ పారిశ్రామికవేత్తకు నోటీసులు పంపించి ఈడీ నోటీసులు వచ్చాయి. ఈడీ అధికారులను తానే మేనేజ్ చేస్తానంటూ అతన్ని ఢిల్లీ తీసుకెళ్లి.. పెద్ద హోటల్లో కూర్చోబెట్టి.. సూట్స్ వేసుకుని, టైలు కట్టుకున్న వ్యక్తులను తీసుకొచ్చి వీళ్లే ఈడీ అధికారులు అంటూ షో చేశాడు. ఈ క్రమంలో అతనిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేశారు. ఇలా ఎన్నో మోసాలకు పాల్పడ్డాడు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఓపెన్ చేస్తామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

రసాభాసగా వార్డు సభ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో మంగళవారం నిర్వహించిన వార్డు సభ రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు ఒకరినొకరు విమర్శించుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక జాబితా మొత్తం ఏకపక్షంగా ఉందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. అర్హులకు కాకుండా అనర్హులకే పథకాలు ఎక్కువగా అందేలా ఉన్నాయని మండిపడ్డారు. మొత్తం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అనుకూలంగా ఉన్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కార్యక్రమంలో కొత్త ఆర్తిక, కౌన్సిలర్లు గోపగల్ల మహేందర్, వనం శ్రీనివాస్, దాసుగౌడ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న ప్రజలు

ఫ్యూచర్ సిటీ రోడ్డుకు భూములివ్వం


నినాదాలు చేస్తున్న రైతులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీకి తమ భూములు ఇచ్చేదిలేదని రైతులు తేల్చి చెప్పారు. మండల పరిధిలోని లేమూరులో మంగళవారం ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూసేకరణ విషయమై రైతులతో చర్చించారు. తమ భూములు ఇవ్వడానికి అంగీకరించేదిలేదని వారు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న శ్రీశైలం రహదారినే విస్తరిస్తే తమ భూములు కోల్పోవాల్సిన అవసరం ఉండదన్నారు. తప్పనిసరైతే భూమికి భూమి లేదంటే బహిరంగ మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. దీంతో మీరు ఏ విషయం తేల్చనప్పుడు ఎందుకు సమావేశం పెట్టారని, కలెక్టర్‌తోటే సమావేశాన్ని ఏర్పాటు చేయొచ్చు కదా అని రైతులు నిలదీశారు. సమావేశానికి హాజరైనట్లు సంతకాలు చేయకుండానే రైతులు తమ అభిప్రాయాన్ని చెప్పి మధ్యలోనే వెళ్లిపోయారు. అనంతరం బయటికి వచ్చి న్యాయం కావాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు, స్థానిక కాంగ్రెస్ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి
- కాచారంలో గ్రామసభకు హాజరు


కాచారం గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

శంషాబాద్ రూరల్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కాచారంలో ప్రజాపాలనలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల విషయమై ఎవరూ ఆందోళన చెందవద్దని..ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, అలాగే అర్జీలు చేసుకోనివారు ఉంటే కొత్తగా మళ్లీ దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. కొత్త కార్డులతో పాటు పేర్ల మార్పులు, చేర్పుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డుల పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకే మూడు రోజుల పాటు పంచాయతీలు, మున్సిపాలిటీలో గ్రామసభలు, వార్డు సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అర్హుల జాబితాను ఈ సభల్లోనే ప్రదర్శిస్తామని, వీటిపై సందేహాలు, అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామని పేర్కొన్నారు. సాగుకు యోగ్యమైన భూములకు ఏడాదికి రూ.12 వేలు పెట్టుబడి సాయం అందుతుందన్నారు. భూమిలేని పేదలు జాతీయ ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి 20 రోజులు పని చేస్తే ఏడాదికి రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుందన్నారు. ఇల్లు కట్టుకునేందుకు స్థలం ఉన్నవారు, స్థలం లేని వారి జాబితాను వేర్వేరుగా ప్రకటిస్తామన్నారు. అలాగే గ్రామంలో ఆయా పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాను ప్రకటించారు. ఇన్‌స్పెక్టర్ కే నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎంపీడీఓ మున్నీ, ఎంపీఓ ఉషా, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ పి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ బలరాం తెలిపిన ప్రకారం .. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రాయకుంట తండాకు చెందిన గణేశ్(19), సురేశ్ ఈ నెల 19న బైక్‌పై మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో పీర్లగూడ సమీపానికి రాగానే వారి వాహనాన్ని వెనక నుంచి వస్తున్న మరో బైక్ వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గణేశ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి బంధువు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చింతుల్లలో ఉద్రిక్తత

అనుమానంతో
మృతదేహానికి పోస్టుమార్టం

యాచారం: మండల పరిధిలోని చింతుల్ల గ్రామంలో మంగళవారం ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. యాచారం సీఐ నర్సింహరావు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కాసోజు రమాచారి(40) మోటార్ మెకానిక్‌గా పనిచేస్తూ నగరంలో స్థిరపడ్డాడు. అనారోగ్యం కారణంగా ఆయన సోమవారం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు రమాచారి మృతదేహన్ని స్వగ్రామం చింతుల్లకు తీసుకువచ్చారు. మృతదేహంపై గాయాలు ఉండడం గమనించిన గ్రామస్తులు దాడి చేసి చంపారనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్లూస్ టీం పోలీసులు మృత దేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. మృతుడికి భార్య ఉమారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు


బాలిక కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న చైల్డ్‌లైన్, ఐసీడీఎస్ సిబ్బంది

ఇరువర్గాల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

- బాలికను సఖి సెంటర్‌కు తరలింపు

ధారూరు: ఓ బాలికలకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని 1098కు మంగళవారం సమాచారం ఇచ్చింది. విషయం తెలుసుకున్న చైల్డ్‌లైన్, ఐసీడీఎస్, పోలీసు శాఖల సిబ్బంది వెంటనే వివాహాన్ని అడ్డుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని ధర్మాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేసేందుకు తల్లిదండ్రులు నిశ్చయించారు. బాలిక వికారాబాద్ సమీప కొత్తగడి రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తనకు పెళ్లి ఇష్టం లేదని చెప్పినా తల్లిదండ్రులు పట్టించుకోలేదు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన కూతురు వివాహం చేసేందుకు నిర్ణయించి కళాశాలకు పంపలేదు. ఎందుకు పంపించడం లేదని కళాశాల నుంచి ఫోన్ చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో చైల్డ్‌లైన్, ఐసీడీఎస్, పోలీస్ శాఖల సిబ్బంది గ్రామానికి చెందిన ఇరువర్గాల తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లి వాయిదా వేయించారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని ఆదేశించారు. బాలికను వికారాబాద్ సఖి సెంటర్‌కు తరలించారు.

జిల్లా స్థాయి ఒలింపియాడ్‌కు విఠ్యాల విద్యార్థులు

షాద్‌నగర్: మండల పరిధిలోని విఠ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం శివరాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విఠ్యాల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన శ్వేత, బ్యాగరి సంధ్య, ఎండీ నయీం, కార్తీక్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం రవి తెలిపారు.


జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం రవి

ఊరెళ్లను మున్సిపల్‌లో విలీనం చేయొద్దు


ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఊరెళ్ల గ్రామస్తులు

ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి గ్రామస్తుల వినతి

చేవెళ్ల: ఊరెళ్లను చేవెళ్ల మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని పలువురు గ్రామస్తులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు, వ్యవసాయం చేసుకుంటూ గ్రామీణవాతావరణంలో ఉన్న తమ గ్రామాన్ని మున్సిపల్‌లో విలీనం చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పట్టణ వాతవారణానికి అనుకూలత లేని తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలుపవద్దన్నారు. దాదాపు 300 మందికిపైగా పేదలు ఉపాధిహామీపథకంపై ఆధారపడి జీవిస్తున్నారని వారికి ఉపాధి లేకుండాపోతుందన్నారు. వ్యవసాయమే ప్రధానంగా బతుకుతున్నారని అధిక పన్నులు చెల్లించలేని పరిస్థితి ఎదురవుతుందని చెప్పారు. చేవెళ్ల సరిహద్దులో ఉన్న కందవాడ, పలుగుట్ట, పామెన, మల్లారెడ్డిగూడ లాంటి గ్రామాలను మున్సిపాలిటీలో కలుపకుండా ఎలాంటి సంబంధం లేని తమ గ్రామాన్ని కలుపడం సరికాదన్నారు. దీనిపై కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మెల్యే తదితరులకు కలిసి వినతి పత్రాలను అందిస్తున్నామన్నారు.

అదుపుతప్పిన ఆటో

ఇద్దరికి తీవ్రంగా..
ముగ్గురికి స్వల్పగాయాలు


ఘటనాస్థలిలో గుమికూడిన జనం

షాబాద్: ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్రగాయాలవ్వగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన షాబాద్ ఠాణా పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. సర్దార్‌నగర్ నుంచి ఓ ఆటో ఆరుగురు ప్రయాణికులతో షాబాద్‌కు ప్రయాణిస్తోంది. షాబాద్ సమీపంలో ఈట్ అండ్ ప్లే సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కుమ్మరిగూడకు చెందిన కుమ్మరి ఎల్లయ్య, కొమరబండకు చెందిన గందం రాములుకు తీవ్రంగా గాయపడగా.. ఎల్లయ్య భార్య పద్మమ్మ, చర్లగూడకు చెందిన మల్కాపురం సాయిలమ్మ అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దామపల్లి రాములు, ముద్దెంగూడకు చెందిన రాములుకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి బలవన్మరణం


బాలయ్య మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తారామతిపేట గ్రామానికి చెందిన చేగూరి బాలయ్య(56) కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 7.30గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలయ్య తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గ్రామ శివారులోని ఓ చెట్టుకు తాడుతో ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కాల్పుల' వాహనం దొరికింది

- ఎంజీబీఎస్ పార్కింగ్ నుంచి బైక్ రికవరీ
- ఆదిలాబాద్ మీదుగా మహారాష్ట్రకు దుండగుల పరారీ
- కష్టసాధ్యమవుతున్న గాలింపు
- అఫ్జల్‌గంజ్ ఘటనపై దర్యాప్తు ముమ్మరం

సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకతో పాటు నగరంలో తుపాకీతో కాల్పులకు తెగబడిన దుండగులు వినియోగించిన వాహనాన్ని హైదరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అఫ్జల్‌గంజ్‌లోని మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్) పార్కింగ్ నుంచి ఈ వాహనాన్ని మంగళవారం రికవరీ చేశారు. నిందితుల ఆదిలాబాద్ మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశించినట్లు అనుమానిస్తున్న అధికారులు.. ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే 750 సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజ్‌ను వడపోసిన సిటీ పోలీసులు మరిన్ని కెమెరాల ఫీడ్‌ను అధ్యయనం చేయడంపై దృష్టి పెట్టారు. నేరం జరిగిన తీరు, ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న దుండగులు.. హైదరాబాద్‌లోనే షెల్టర్ తీసుకుని, బీదర్‌లో నేరం చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. బీదర్‌లోని శివాజీ జంక్షన్ వద్ద ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రాల్లో డబ్బు నింపే సీఎంఎస్ ఏజెన్సీ వాహనాన్ని కొల్లగొట్టడానికి దుండగులు బైక్‌పై వెళ్లారు. ఈ వాహనానికి 'ఏపీ' రిజిస్ట్రేషన్‌తో కూడిన నకిలీ నంబర్ ప్లేట్ ఉంది. దీన్ని హైదరాబాద్ లేదా శివారు ప్రాంతాల్లో చోరీ చేసి ఉంటారని భావిస్తున్న అధికారులు.. ఆ కోణంలో ఆరా తీస్తున్నారు. బీదర్‌లో నేరం చేసిన తర్వాత రాయ్‌పూర్ వెళ్లడానికి అఫ్జల్‌గంజ్‌కు వచ్చిన దుండగులు.. రోషన్ ట్రావెల్స్ వద్దకు ఎంజీబీఎస్ వైపు నుంచి ఆటోలో వచ్చారు. దీని ఆధారంగా ముందుకు వెళ్లిన దర్యాప్తు అధికారులు మంగళవారం ఎంజీబీఎస్ పార్కింగ్‌లో ఉన్న అనుమానాస్పద వాహనాలను పరిశీలించారు. గురువారం పార్క్ చేసిన వాటి వివరాలు ఆరా తీసి నిందితులు వాడింది గుర్తించారు. నిందితులు సికింద్రాబాద్‌లోని అల్ఫా హోటల్ వద్ద ఎక్కిన ఆటోలో గజ్వేల్ వెళ్లాలని ప్రయత్నించి, తిరుమలగిరిలో దిగిపోయారు. అక్కడ నుంచి శుక్రవారం మధ్యాహ్నానికి ఆదిలాబాద్ చేరుకున్న దుండగులు సరిహద్దులు దాటించి మహారాష్ట్రలో ప్రవేశించినట్లు పోలీసులకు ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఆద్యంతం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించిన నిందితుల ఆచూకీ కనిపెట్టడానికి పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదు

రూ. 500 జరిమానా

శంకర్‌పల్లి: అనుమానంతో భార్యను హతమార్చిన భర్తకు రంగారెడ్డి జిల్లా కోర్టు జీవితఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. మోకిల సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మిర్జాగూడ అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డినగర్‌లో మాణిక్యం(48), యాదమ్మ(45) దంపతులు నివసిస్తుండేవారు. మాణిక్యం నిత్యం తాగి వచ్చి భార్యకు వివాహేతర సంబంధం ఉందని గొడవపడేవాడు. ఈ క్రమంలో 2024 మే 5న నిద్రిస్తున్న యాదమ్మ తలపై బండ రాయితో మోది కిరాతంగా హత్యచేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు వివరాలు జిల్లా పీడీజే కోర్టు న్యాయమూర్తి ఎస్.శశిధర్‌రెడ్డికి సమర్పించగా ఆయన నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అబ్దుల్లాపూర్‌మెట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తారామతిపేట రెవెన్యూ పరిధిలోని సద్దుపల్లి ఇటుక కంపెనీ వెనుక గుంతలో ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు మంగళవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వరకు ఉండొచ్చని, మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. మృతుడి ఒంటిపై ఫుల్ హ్యాండ్స్ టీషర్ట్, డ్రాయర్ మాత్రమే ఉందని.. శవం పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వస్తూ గుర్తు పట్టలేని స్థితిలో ఉందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వివాహిత అదృశ్యం

శంషాబాద్ రూరల్: వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కే నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతూప్ర గ్రామానికి చెందిన తెలగమల్ల అఖిల (36) ఈనెల 20న కిరాణ దుకాణానికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. వారం క్రితం భర్త యాదగిరితో గొడవ పడగా.. పెద్దలు సర్దిచెప్పారు. ఈ క్రమంలోనే ఆమె ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైంది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుకు చివరి తేదీ లేదు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


మాట్లాడుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని.. దరఖాస్తులకు చివరి తేదీ లేదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్కతల, మమ్మదాంపల్లి, నాగిరెడ్డిపల్లి, కేశవపల్లి, పులుమామిడి, లింగంపల్లి, మాదారం గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు, రైతు భరోసా తదితర పథకాలకు గాను 589 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ అనురాధ తెలిపారు. పులుమామిడి, లింగంపల్లి గ్రామసభల్లో ఎమ్మెల్యే యాదయ్య పాల్గొని మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. ప్రజాపాలన, గ్రామసభలే కాకుండా దరఖాస్తుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు.

బుద్ధ భవన్ పక్కనే హైడ్రా ఠాణా

ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు

- పరిశీలించిన కమిషనర్ రంగనాథ్
- వచ్చే నెల నుంచి కార్యకలాపాలు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పోలీసుస్టేషన్ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ప్రభుత్వం ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఠాణాను హైడ్రా ప్రధాన కార్యాలయం ఉన్న బుద్ధ భవన్ పక్కనే ఏర్పాటు చేయనున్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) జీహెచ్ఎంసీ అధీనంలో ఉన్నప్పుడు బుద్ధ భవన్‌లో దీని కార్యాలయం ఉండేది. దాని పక్కనే ఉన్న భవనంలో విజిలెన్స్ విభాగం కొనసాగేది. ప్రస్తుతం డీఆర్ఎఫ్‌లో హైడ్రా ప్రధాన కార్యాలయం కొనసాగుతుండగా.. నాటి విజిలెన్స్ కార్యాలయాన్ని ఠాణాగా మారుస్తున్నారు. హైడ్రా పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను మంగళవారం కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు.

శాంతి భద్రతల విభాగం తరహాలోనే..

శాంతిభద్రతల విభాగం పోలీసుస్టేషన్ తరహాలోనే ఈ ఠాణాలోనూ గదులు, క్యాబిన్లు ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు. అక్కడ పని చేసే అధికారులతో పాటు ఫిర్యాదు చేయడానికి వచ్చే వారికీ పూర్తి సౌకర్యాలు ఉండేలా ఆయన చర్యలు తీసుకుంటున్నారు. ఠాణా సైన్ బోర్డులు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయనున్నారు. అధికారులు, సిబ్బందితో పాటు ఫిర్యాదుదారుల వాహనాలు పార్క్ చేసుకోవడానికి ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. రానున్న ఫిబ్రవరి మొదటి వారం నుంచి హైడ్రా ఠాణా కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా రంగనాథ్ కసరత్తు చేస్తున్నారు. ఈ ఠాణాకు ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) ఉండనున్నారు. ఓఆర్ఆర్ లోపలి భాగం, దానికి ఆనుకుని ఉన్న మున్సిపాలిటీలు దీని పరిధిలోకి వస్తాయి.

నేరుగా హైడ్రా ఠాణాలోనే..

చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కుల తదితరాలను కబ్జా చేయడం, పూడ్చివేయడం తదితర అంశాలపై హైడ్రా కన్నేసి ఉంచుతోంది. జల వనరుల్లో కట్టడాలకు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడాన్నీ తీవ్రంగా పరిగణిస్తోంది. దీనిపై ప్రస్తుతం ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తోంది. దైనందిన కార్యకలాపాల్లో ఉండే స్థానిక పోలీసులు ఈ అంశాలకు కీలక ప్రాధాన్యం ఇచ్చి దర్యాప్తు చేయలేకపోతున్నారు. ఇది కబ్జాకోరులు, అక్రమార్కులకు వరంగా మారుతోంది. ఇకపై ఇలాంటి కేసుల్ని నేరుగా హైడ్రా ఠాణాలోనే నమోదు చేసి, దర్యాప్తు చేస్తారు. ఈ ఠాణాలో పని చేయడానికి సిబ్బంది, అధికారులను డిప్యుటేషన్ ప్రాతిపదికపై తీసుకోనున్నారు.